ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 8 నవంబరు 2025



శ్రీచరణికి నీరాజనం

- ర్యాలీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన
- వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో ఘనసత్కారం
- రూ.10లక్షలు ప్రోత్సాహక నగదు



కడపలో తల్లిదండ్రులు రేణుక, నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలతో కలసి గుర్రబ్బండిలో శ్రీచరణిని ఊరేగిస్తున్న దృశ్యం



శ్రీచరణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సత్కారం

కడప స్పోర్ట్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళల ప్రపంచకప్ గెలుచుకున్న భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన శ్రీచరణి కడపగడపలో జనం నీరాజనం పలికారు. జిల్లాకు చెందిన శ్రీచరణి ప్రపంచకప్ గెలుచుకున్న తర్వాత మొదటిసారిగా శుక్రవారం కడపకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీచరణికి ఘన స్వాగతం పలికారు. సాయంత్రం 4.30గంటలకు కడపకు రావలసిన శ్రీచరణి రాత్రి 7.30కు కడప కళాక్షేత్రం వద్దకు చేరుకుంది. దీంతో అప్పటికే ఆమె రాకకై స్పోర్ట్స్ స్కూలు విద్యార్థులు, కోటిరెడ్డికళాశాల విద్యార్థులు, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు, డీఎస్‌ఏ స్టేడియం ప్రతినిధులు, వివిధ క్రీడారంగ కోచ్‌లు నగర ప్రజలు, క్రికెట్ క్రీడాభిమానులు పెద్దఎత్తున హాజరయ్యారు. అనంతరం ప్రత్యేకరించిన వాహనంలో శ్రీచరణి, ఆమె తల్లిదండ్రులు రేణుక, నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆశీనులయ్యారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా నగర ఏడురోడ్లు, ఎన్టీఆర్‌సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్ మీదుగా రాజీవ్‌పార్కు వరకు వచ్చారు. ర్యాలీలో దారివెంట క్రీడాభిమానులు జాతీయ జెండా చేత బట్టుకుని జై భారత్ అంటూ నినాదాలు చేశారు. అడుగడుగునా క్రీడాభిమానులు శ్రీచరణికి నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూలు స్పెషలాఫీసర్ జగన్నాథరెడ్డి, వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియం ప్రతినిధులు మునికుమార్‌రెడ్డి, సంజయ్‌కుమార్, పీఈటీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా.. శ్రీచరణి ర్యాలీకి పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. ర్యాలీ ఆద్యంతం ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యువతకు శ్రీచరణి స్ఫూర్తిదాయకం

ప్రపంచ మహిళా క్రికెట్ కప్ సాధించడంలో కీలక పాత్ర వహించిన కడప జిల్లా క్రీడాకారిణి శ్రీచరణి యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని కడప, కమలాపురం ఎమ్మెల్యేలు ఆర్.మాధవి రెడ్డి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో శ్రీచరణికి ప్రత్యేక సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ఇటీవల ముగిసిన ప్రపంచ మహిళా క్రికెట్ పోటీల్లో శ్రీచరణి తన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ మాయాజాలంతో రాణించడం చాలా సంతోషకరమన్నారు. కప్ విజయంతో శ్రీచరణి కడపకు రావడంతో పండుగ వాతావరణం నెలకొందన్నారు. శ్రీచరణి కడప జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీచరణి తన అద్భుత బౌలింగ్‌తో పరుగులకు అడ్డుకట్ట వేశారన్నారు. మున్ముందు ఇదే ఆటతీరుతో కెప్టెన్‌గా ఎదిగి వచ్చే మహిళా క్రికెట్ కప్పును సొంతం చేసుకోవాలన్నారు. అనంతరం క్రీడాకారిణికి ఘన సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డిప్రసాద్, నగర ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్‌బేగం పాల్గొన్నారు. కాగా.. శ్రీచరణికి ప్రోత్సాహంగా ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి రూ.5 లక్షలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మరో రూ.5 లక్షలు ప్రకటించారు.





10 నుంచి సమ్మేటివ్ పరీక్షలు

- విద్యాశాఖ షెడ్యూల్ విడుదల

కడప ఎడ్యుకేషన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్‌ఏ-1) పరీక్షలను ఈనెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్, మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉదయం 8, 9, 10 తరగతులు, మధ్యాహ్నం 6, 7 తరగతుల పరీక్షలు జరుగుతాయి.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

నవంబరు 10న తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లీష్, 13న గణితం, 14న జనరల్ సైన్స్/ఫిజికల్ సైన్స్, 15న బయోలాజికల్ సైన్స్, 17న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలల పరీక్షలు ఉదయం పూట మాత్రమే నిర్వహిస్తారు. 11న తెలుగు, 12న ఇంగ్లీష్, 13న గణితం, 14న ఈవీఎస్ పరీక్షలు నిర్వహిస్తారు. ఓరియంటల్ పాఠశాలలకు చెందిన పరీక్షలు 18, 19 తేదీల్లో జరుగుతాయి. 10వ తరగతికి 100 మార్కులు, ఇతర తరగతులకు 80 మార్కులు ఉంటాయి. అక్టోబరు వరకు ఉన్న సిలబస్‌పై ప్రశ్నలు ఉంటాయి.

త్రిసభ్య కమిటీ

1 నుంచి 5వ తరగతుల ప్రశ్నాపత్రాలను క్లస్టర్ కాంప్లెక్స్‌లలో, 6 నుంచి 10 తరగతుల ప్రశ్నాపత్రాలను ఎమ్మార్సీలో భద్రపరుస్తారు. పంపిణీ కోసం ఎమ్మార్సీ స్థాయిలో ఎంఈఓ-1, ఎంఈఓ-2 ఒక ప్రధానోపాధ్యాయుడుతో త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేశారు. క్లస్టర్ స్థాయిలో ప్రధానోపాధ్యాయుడు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్, ఒక రీసోర్స్ పర్సన్ (ఆర్పీ)తో కమిటీ ఏర్పాటు చేశారు. ప్రతి సెషన్ ప్రారంభానికి ఒక గంట ముందు మాత్రమే ప్రశ్నాపత్రాలు పాఠశాలలకు అందజేయాలని ఆదేశించారు. సమాధాన పత్రాల మూల్యాంకనం నవంబరు 25 నాటికి, ప్రోగ్రెస్ కార్డుల జారీ నవంబరు 30 నాటికి పూర్తి చేయాలని షెడ్యూల్‌లో విద్యాశాఖ సూచించింది. కాగా.. ఈనెల 14వ తేదీ బాలల దినోత్సవం కావడంతో ఆ రోజున విద్యార్థులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా సమ్మేటివ్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు, సివి ప్రసాద్, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు సూచించారు. పరీక్షల మూల్యాంకనానికి గడువు పెంచాలని కోరారు.

క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం


కడప కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో క్యాన్సర్ అవగాహన దినోత్సవం జరిగింది. అనంతరం కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ ఐటిఐ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్ హెచ్‌ఓ మాట్లాడుతూ జీవన శైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. బీపీ, షుగర్ వ్యాధులతో పాటు క్యాన్సర్ వ్యాధులు కూడా పెరుగుతున్నాయన్నారు. క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నయం అవుతుందన్నారు. ఆలస్యంగా వ్యాధి నిర్ధారణ జరిగితే నయం కాదని అన్నారు. దీంతో పేషెంట్‌తో పాటు కుటుంబసభ్యులు ఆర్థిక, మానసిక ఒత్తిడి ఎదుర్కొంటారని తెలిపారు. అనంతరం వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్ కుమార్, బాలాంజనేయులు, వెంకట చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణంపల్లెలో బోరు ఆడకుండానే బయటకు వస్తున్న నీరు



ఉప్పొంగంగ

దువ్వూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు తోడు మొంథా తుఫాను ప్రభావంతో భూగర్భజలాలు బాగా పెరిగాయి. దువ్వూరు మండలంలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. క్రిష్ణంపల్లెలో విద్యుత్ మోటార్లు ఆడించకపోయినా బోర్ల నుంచి నీరు బయటకు వస్తోంది. దీంతో రైతులు ఆశ్చర్యపోతున్నారు. గ్రామంలో వెంకట సురేశ్ అనే రైతు పసుపు, వరి సాగు చేశారు. విద్యుత్ మోటారు వేయకపోయినా పైపు నుంచి నీళ్లు 20రోజులుగా బయటకు వస్తున్నాయని రైతు తెలిపారు. దువ్వూరు వద్ద కేసీ కాలువ సమీప చింతమాను తోటలో మల్లెంనాయుడుకు చెందిన బావి నిండిపోయి నీరు పసుపు తోటలోకి వస్తోంది. దీంతో అతను పసుపు పంటను కాపాడుకునేందుకు బావిలోని నీటిని మోటారుతో పక్కనే ఉన్న కేసీ కాలువలోకి వదులుతున్నాడు. మునుపు పైర్లను కాపాడుకునేందుకు నీళ్లకోసం తిప్పలు పడిన రైతులు.. ఇప్పుడు అదే నీరు ఎక్కువైపోయి పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



దువ్వూరు వద్ద పసుపుపంట దెబ్బతినకుండా ఉండేందుకు బావి నీటిని కేసీ కాలువలోకి వదులుతున్న దృశ్యం

వందేమాతరం గేయాలాపన

కడప క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం 'వందేమాతరం' సామూహిక గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. బంకించంద్ర చటర్జీ రచించి స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లమంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి శుక్రవారంతో 150 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో దేశభక్తిని, జాతీయ స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు, డీపీవో సిబ్బంది అంతా ఏకమై వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు కె.ప్రకాశ్‌బాబు, రమణయ్య, ఆర్‌ఐలు శివరాముడు, సోమశేఖర్‌నాయక్, టైటస్, శ్రీశైలరెడ్డి, ఏవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



వందేమాతరం ఆలపిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, పోలీసు అధికారులు

డీలర్‌పై కేసు నమోదు

- అర్ధరాత్రి రేషన్‌బియ్యం పక్కదారి పట్టించే యత్నం
- అడ్డుకున్న విజిలెన్స్, రెవెన్యూ అధికారులు



అక్రమంగా తరలించేందుకు వామిదొడ్డిలో దాచిన రేషన్ బియ్యం



సీజ్ చేసిన రేషన్ దుకాణానికి కిటికీ పగులకొట్టిన దృశ్యం

బద్వేలుటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపులోని బియ్యాన్ని అక్రమంగా తరలించే ప్రయత్నం జరుగుతుండగా పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకుని డీలర్‌పై కేసు నమోదు చేశారు. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని అబ్బరాతివీధిలో ఉండే 22వ రేషన్ దుకాణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు గురువారం ఉదయం తనిఖీ చేసేందుకు రాగా ఆ సమయంలో ఆ సమయంలో దుకాణం మూసి ఉంచారు. అధికారులకు అనుమానం వచ్చి రేషన్ డీలర్‌కు ఫోన్‌చేయగా, తాము బయట ఉన్నామని సాయంత్రం వస్తామని చెప్పారు. దీంతో విజిలెన్స్ అధికారులు తాము తనిఖీచేసేంత వరకు రేషన్‌పంపిణీకి వీలులేకుండా ఆ దుకాణాన్ని సీజ్‌చేశారు. ఇది తెలుసుకున్న రేషన్‌షాపు డీలర్ గురువారం అర్ధరాత్రి సీజ్‌చేసిన రేషన్ దుకాణం కిటికీ పగులకొట్టి అందులోని 16 బస్తాల రేషన్‌బియ్యాన్ని దొంగచాటుగా వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న బద్వేలు అర్బన్ సీఐ లింగప్ప తనసిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. దీంతో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారు అక్కడి నుంచి పరారయ్యారు. శుక్రవారం ఉదయం విజిలెన్స్ అధికారులు ఏసీటీఓ గీతావాణి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ శివశంకర్ మాట్లాడుతూ సీజ్ చేసిన రేషన్‌షాపులోని బియ్యాన్ని అక్రమంగా తరలించే యత్నం చేశారన్నారు. ఈ మేరకు 1,160 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డీలర్‌పై కేసులు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన షాపులోని బియ్యాన్ని అర్ధరాత్రి అక్రమంగా తరలించడం చట్టరీత్యానేరమన్నారు. రేషన్‌షాపులో ఉండాల్సిన బియ్యం కన్నా అధికంగా ఉండటంతో తనిఖీలు నిర్వహించామన్నారు.

మచిలీపట్నం-కొల్లం మధ్య ప్రత్యేక వీక్లీ రైలు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-కొల్లం మధ్య కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలు (నెంబర్ 07103/07104) నడప నున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. మచిలీపట్నంలో శుక్రవారం (డిసెంబరు 5, 12, 19 తేదీలు 2026 జనవరి 9, 16 తేదీలలో) ఉదయం 11గంటలకు రైలు బయలుదేరుతుం దన్నారు. అదేరోజు రాత్రి ప్రొద్దుటూరుకు 11:03 గంటలకు, ఎర్రగుంట్లకు 11:28, కడపకు అర్ధరాత్రి 00:03, రాజంపేటకు 00:58, కోడూరుకు 02:03, రేణిగుంటకు 3:25 గంటలకు చేరుకుని.. కాట్పాడి జోలార్పేట మీదుగా అదేరోజు రాత్రి 10గంటలకు కొల్లం చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో కొల్లం నుంచి ఆదివారం (డిసెంబరు 7, 14, 21 తేదీలు, 2026 జనవరి 11, 18 తేదీలలో) మధ్యాహ్నం 2:30గంటలకు బయలుదే రుతుందన్నారు. రేణిగుంటకు అదేరోజు రాత్రి 9:50కి కోడూరుకు 10:36, రాజంపేటకు 11:08, కడపకు 11:53, ఎర్రగుంట్లకు అర్ధరాత్రి 12:28, ప్రొద్దుటూరుకు 12:53గంటలకు చేరుకుంటుందని చెప్పారు. నంద్యాల, విజయవాడ మీదుగా మచిలీపట్నానికి మధ్యాహ్నం 12:30 గంటలకు చేరుకుంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, కేరళ మధ్య ప్రయాణికుల సౌకర్యార్థంగా ప్రత్యేక రైలును వేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పేదల బియ్యం పక్కదారి

- కార్డుదారుల ఇళ్లవద్దే నేరుగా కొనుగోళ్లు
- ఈ-పోస్‌లో వేలిముద్రల సేకరణ
- వృద్ధుల ఆప్షన్‌ను దుర్వినియోగం చేస్తున్న డీలర్లు
- ఆన్‌లైన్‌లో చెక్ చేయని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పేదల బియ్యం పక్కదారి పట్టించేవారిపై పీడీ యాక్టు పెట్టి రేషన్ మాఫియాను అరికడతామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. రేషన్ డీలర్లే ఇంటింటికి వెళ్లి బియ్యం కొనుగోలు చేసి వారికి నగదు పంపిణీ చేస్తున్నారు. దీంతో నేరుగా రేషన్ షాపులనుంచే పేదల బియ్యం బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతోంది. కూటమి ప్రభుత్వం వృద్ధులకోసం ఇచ్చిన ఆప్షన్ ద్వారా డీలర్లు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రొద్దుటూరు, నవంబరు 7(ఆంధ్ర జ్యోతి): వైసీపీ హయాంలో ఇంటింటికి రేషన్ పంపిణీ ఎండీయూ ఆపరేటర్ల ద్వారా జరిగేది. అయితే కార్డుదాలకు నగదు ముట్టజెప్పి అదే వాహనాల్లో రేషన్ బియ్యం బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఎండీయూ వాహనాలను రద్దు చేసి చౌకదుకాణాల్లోనే రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. 65 ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు మాత్రం ఇంటి వద్దకే ప్రతినెలా 26 నుంచి 30 తేదీ లోపల డీలర్లే వెళ్లి ఈ పోస్ మిషన్‌లో వేలిముద్రలు తీసుకొని బియ్యం అందజేయాలని నిర్ణయించింది. దీనిని కొందరు డీలర్లు అవకాశంగా మార్చుకున్నారు. ప్రతికార్డుదారునికి ఇంటి వద్దకే వెళ్లి ఈ ఐదు రోజులు ఈ పోస్ మిషన్‌లో వేలిముద్రలు తీసుకొని రేషన్ బియ్యం కిలో రూ.13 నుంచి రూ.15 చొప్పున ఇస్తున్నారు. ఆ తరువాత నేరుగా చౌక దుకాణం నుంచే రేషన్ బియ్యాన్ని డీలర్లే బ్లాక్‌మార్కెట్‌కు తరలించి కిలో రూ.18నుంచి రూ.20 వరకు అమ్ముకుంటున్నారు. ఈవిషయం రెవెన్యూ, సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలిసినా.. పరోక్షంగా ఈ అక్రమ రేషన్ బియ్యం దందాకు మద్దతు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

డీలర్లపై చర్యలు తీసుకుంటాం..

వృద్ధుల కోసం ఇచ్చిన ఆప్షన్‌ను దుర్వినియోగం చేసి బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలించే వారిపై నిఘా పెడతాం. ఇక నుంచి ప్రతి నెలా ఆన్‌లైన్‌లో వృద్ధుల కార్డులకంటే ఎక్కువ కార్డులు ఆ తేదీలలో పంచినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటాం. వారి లైసెన్సు రద్దు చేస్తాం.

- గంగయ్య, తహశీల్దారు, ప్రొద్దుటూరు

ఇళ్లవద్దకే వెళ్లి..

జిల్లాలో మొత్తం 1,239 చౌకదుకాణాలుండగా 5,78,884 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. ప్రొద్దుటూరులో 143 చౌకదుకాణాలు, 69,258 కార్డులు ఉన్నాయి. ప్రొద్దుటూరులో వృద్ధులు, దివ్యాంగులవి ఉన్నది కేవలం 6,004 కార్డులు మాత్రమే. కానీ డీలర్లు ప్రతి నెలా 26 నుంచి 30 తేదీలోపల వృద్ధులకు, దివ్యాంగులకు ఉన్న కార్డులతో పాటు వందలాది కార్డులకు వారి ఇళ్లవద్దకే వెళ్లి రేషన్ బియ్యం పంపిణీ పేర వేలిముద్రలు వేయించుకుని డబ్బులు ఇచ్చేస్తున్నారు.

కొన్ని ఉదాహరణలు..

ప్రొద్దుటూరులో అక్టోబరు 26 నుంచి 30వ తేదీలోపు కొందరు డీలర్లు ఆన్‌లైన్ చేసిన కార్డుల సంఖ్య ఇలా..

దుకాణం	కార్డులు	వృద్ధులవి	ఆన్‌లైన్
1182007	683	52	166
1182008	638	47	300
1122025	734	41	124
1182056	570	42	358
1182077	859	51	147
1115094	403	63	197
1115108	530	77	197
1115131	669	52	483
1115132	900	74	154
1115140	642	47	148
1115141	644	54	259

ఏసీబీ దాడులపై కొనసాగుతున్న ఉత్కంఠ

● వెలుగులోకి రాని విచారణ వివరాలు ● తెరుచుకోని డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు ● సెలవులో సబ్‌రిజిస్ట్రార్.. ఆగిన రిజిస్ట్రేషన్లు ● వెలవెలబోతున్న కార్యాలయం

రాజంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏసీబీ దాడుల నేపథ్యంలో మూడు రోజులుగా రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెలవెలపోతుండగా, సుమారు 15 దాకా డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు మూత పడ్డాయి. దీంతో కార్యాలయంలో ఏం జరిగిందో అన్న అంశంపై సస్పెన్స్ కొన సాగుతోంది. గత బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. బుధవారం రాత్రి పొద్దుపోయేంత వరకు అన్ని రికార్డులను పరిశీలించారు. గురువారం ఉదయం కూడా కొన్ని పత్రాలను పరిశీలించారు. ఏసీబీ అధికారులు సబ్‌రిజిస్ట్రార్ కార్యా లయంలోకి ప్రవేశించిన సమయంలో అక్కడున్న నలుగురు డాక్యుమెంట్ రైటర్లను అదుపులోకి తీసుకుని వారి ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు ఎన్ని ఉన్నాయి, వారి వివరాలపై ఆరా తీశారు. ఏ డాక్యుమెంట్ రైటర్‌ల ద్వారా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరగాయన్న విషయంపై విచారణ చేశారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఎంత కమీషన్ తీసుకునేవారు, డాక్యుమెంట్ రైటర్లు తీసుకునే మొత్తం ఎంత? సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చెల్లించే మొత్తం ఎంత? సబ్‌రిజిస్ట్రార్‌కు ముట్టేది ఎంత? మిగిలిన సిబ్బందికి ఎంత వాటా వెళుతుందన్న విషయంపై ఆరా తీశారు. డాక్యుమెంట్ రైటర్ల నుంచి తీసుకెళ్లిన ఫోన్లను గురువారం ఏసీబీ అధికారులు తిరిగి ఇచ్చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అనధికారింగా పనిచేస్తున్న ఓ ప్రైవేటు వ్యక్తిని శుక్రవారం కడపకు పిలిపించుకుని విచారణ చేసినట్లు తెలిసింది. కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులు అనధికారికంగా పని చేస్తున్నారన్న విషయాన్ని, వారి ద్వారా జరిగే లావాదేవీలను తెలుసుకున్నారు. బుధవారం స్లాట్ ప్రకారం 32 రిజిస్ట్రేషన్‌లు జరగాల్సి ఉండగా ఏసీబీ అధికారులు వచ్చిన సమయానికి ముందు వరుసలో ఉన్న 4 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్టర్ అయ్యాయి. గురువారం కేవలం 5 అత్యవసర డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. శుక్రవారం అసలే రిజిస్ట్రేషన్ జరగలేదు. ఆఫీసు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, మరో ముగ్గురు సిబ్బంది మాత్రమే కార్యాలయంలో ఉన్నారు. ఈ విషయమై సిబ్బందిని వివరణ కోరగా శుక్రవారం రిజిస్ట్రేషన్ల స్లాట్ ఆన్‌లైన్ పనిచేయక పోవడంతో రిజిస్ట్రేషన్ జరగలేదని తెలిపారు.



వెలవెలబోతున్న రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



మూతపడిన రైటర్ల గదులు

డీకేటీ రిజిస్ట్రేషన్లపైనే ఆరా..

ఏసీబీ అధికారులు రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ఐదేళ్లుగా జరిగిన డీకేటీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల పైనే పూర్తి స్థాయి విచారణ చేసినట్లు తెలిసింది. గత వైసీపీ హయాంలో రియల్టర్లు, బడా నేతలు ప్రభుత్వ భూములను పెద్దఎత్తున అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకోగా, 20 ఏళ్లుగా డీకేటీ భూములు అనుభవిస్తున్నవారు ఆ భూస్వభాన్ని బట్టి అమ్మకాలు, కొనుగోలు చేసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులు ఆధారం చేసుకుని రూ. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను, గ్రామకంఠం భూములను భారీ ఎత్తున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై ఉక్కుపాదం మోపింది. ఇందుకు సంబంధించి కొన్ని భూముల రిజిస్ట్రేషన్‌లు ఆపివేసింది. అయితే, ఆ ఉత్తర్వులను కూడా లెక్కచేయకుండా రాజంపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భారీఎత్తున ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. తహసీల్దారు, వీఆర్వో అనుమతి, అనుభవ సర్టిఫికెట్లు లేకుండా కేవలం పన్ను రసీదు ఆధారంగా గ్రామకంఠం భూములను రిజిస్ట్రేషన్ చేసిన అంశంపై ఏసీబీ పూర్తిస్థాయి విచారణ చేసినట్లు సమాచారం. గ్రామకంఠ, డీకేటీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌ల వ్యవహారంపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే ఏసీబీ అధికారులు ఇంతవరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. సబ్‌రిజిస్ట్రార్ సెలవుపై వెళ్లడంతో ఏసీబీ విచారణ అంశాలపై మూడు రోజులుగా సస్పెన్షన్ కొనసాగుతోంది.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ

సిద్దవటం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. మృతుడి భార్య కుమారి కథనం మేరకు మామిడి వెంకటనరసారెడ్డి (69) కుటుంబం మాధవరంలోని రోడ్ నెంబర్ 8లో ఉన్న అద్దె ఇంటిలో నివాసం ఉంటోంది. రెడ్డిపల్లె, లింగాలకుంట, సీతారాంపురం గ్రామాల్లో ఆయన పొలాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. ఈ క్రమంలో దాదాపు 40 లక్షలు పైగా అప్పులు చేశాడు. ఈ అప్పుల కారణంగా కొంతకాలంగా మానసిక వ్యథకు గురయ్యాడు. ఈ నేపథ్యం లో గురువారం కడపకు వెళ్లిన ఆయనను మధ్యాహ్న భోజనానికి ఇంటికి రావాలని భార్య ఫోన్ చేసి తెలపగా, తనకు కడపలో పని ఉందని, రాలేనని సమాధానమిచ్చాడు. రాత్రయినా అతను ఇంటికి రాకపోవడమే కాక, ఫోన్ స్విచాఫ్ చేయడంతో ఆ విషయాన్ని బంధువులకు తెలియజేసింది. కాగా, శుక్రవారం ఉదయం పోలీసు బెటాలియన్ వెనుకభాగంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు, మృతుడి జేబులో ఉన్న మొబైల్ ద్వారా కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహ్మద్ రఫీ తెలిపారు. అప్పుల బాధ తాళలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య గోడుగోడున విలపించింది.

వాటర్‌మన్‌పై దాడి

మదనపల్లె అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న తనపై రమణారెడ్డి అనే వ్యక్తి దాడి చేశాడంటూ అనపగుట్ట ఏరియా వాటర్‌మన్ జగన్‌మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనపగుట్ట ప్రాంతంలోని రమణమ్మ అనే మహిళకు తమ కొళాయికి మరమ్మతులు మరమ్మతులు చేయాలంటూ శుక్రవారం ఉదయం వాటర్‌మన్‌ను కోరగా, మున్సిపల్ కార్యాలయంలో చలానా కడితే, ఫిట్టర్ వచ్చి మరమ్మతులు చేస్తాడని సూచించాడు. ఈ విషయాన్ని ఆమె తన కొడుకు రమణారెడ్డికి చెప్పడంతో ఆగ్రహానికి గురైన అతను చౌడేశ్వరి కల్యాణ మండపం వద్ద విధి నిర్వహణలో ఉన్న వాటర్‌మన్‌తో వాగ్వాదానికి దిగడంతో పాటు దాడి చేశాడు. దీంతో గాయపడిన అతనిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై మదనపల్లె మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐ రామాంజనేయులుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు రామారావు కాలనీకి చెందిన శివ బసినికొండ గ్రామంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నెల 4న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తల్లి లక్ష్మీనరసమ్మ అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడి రుయాలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. టూటౌన్ ఎస్‌ఐ రామాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఓబులవారిపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి గాయపడ్డాడు. మండల పరిదిలోని మంగంపేటకు చెందిన గల్లా శేఖర్ టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళుతూ కొర్లకుంట పరిసరాల్లో ముందు వెళుతున్న లారీని ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడు ఏపీఎండీసీ మంగంపేట సంస్థలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది. ఏపీఎండీసీ మంగంపేటకు చెందిన అంబులెన్స్ లో రైల్వేకోడూరులో ప్రథమ చికిత్స చేయించి, తిరుపతికి తరలించినట్లు బంధువులు తెలిపారు. హైవేపై తీవ్రమైన గోతులు ఉండడంతో ఉన్నఫళంగా ముందువైపు వెళుతున్న లారీ నెమ్మది కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ దీన్‌దయాళ్‌రాజు

మదనపల్లె అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కురవంకలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సర్పంచ్ పసుపులేటి చలపతి, హౌసింగ్ డీఈ దీన్‌దయాళ్ రాజు సూచించారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గతంలో గృహనిర్మాణ పథకం కింద లబ్ధిదారులకు చిప్పిలి లేవుట్‌లో ఇంటి స్థలాలను కేటాయించారన్నారు. అందులో 40 ఇళ్లు బేస్‌మెంట్, 10 ఇళ్లు గోడల వరకు పూర్తి చేసి నిలిపేశారన్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని బీసీ, ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అదనంగా నిధులు కేటాయిందిందన్నారు. మరో మూడు నెలలు ఈ అవకాశం ఉంటుందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రమాదం అంచుల్లో అంకాలమ్మ కుంట



రోడ్డు మీద పారుతున్న నీరు



నిండు కుండలా అంకాలమ్మ కుంట

కలికిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలికిరి క్రాస్‌రోడ్డుకు సమీపంలో కలికిరి-రాయచోటి మార్గంలో వున్న అంకాలమ్మ కుంట కట్టకు రెండు చోట్ల గండి పడడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. నెల రోజులుగా ఈ గండ్ల నుంచి నీరు రోడ్డుకు అడ్డంగా ప్రవహిస్తోంది. నెల రోజుల కిందట ఈ పరిస్థితి ఏర్పడిన మొరవ పారుతోందని స్థానికులు తేలిగ్గా తీసుకున్నారు. నెల రోజులైనా ప్రవాహం తగ్గక పోవడంతో కట్టను పరిశీలించి కుంటకట్ట మధ్యలో రెండు చోట్ల గండిపడ్డట్లు గుర్తించి ఇంజనీర్లకు సమాచారం అందించారు. ఇప్పటికే కట్ట మీద తిరిగేందుకు వీలు లేకుండా వివిధ రకాల చెట్లు అడ్డుగా పెరిగాయి. ఎన్నో ఏళ్లగా కట్టను పటిష్టం చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికే కట్ట బలహీనంగా వుంది. ఏ క్షణమైనా కుంట తెగిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గండ్లు పెద్దవై కట్టకు ప్రమాదం జరిగితే పట్టణంలోని పలు భవనాలకుతీవ్రమైన ముప్పు వాటిల్లుతుందని వాపోతున్నారు. కుంటకట్టకు వంద మీటర్ల దూరంలోనే రెండు మద్యం దుకాణాలు, రెండు కల్యాణమండపాలు, కెనరా బ్యాంకు, ఒక ప్రైవేటు పాఠశాల, పలు దుకాణాలు, బిగ్‌బజార్ షాపింగ్ మాల్, రెండు ప్రైవేటు ఆసుపత్రులతోపాటు పలు హోటళ్లు, లాడ్జీలున్నాయి. అందరూ ఊహిస్తున్న విధంగా ప్రమాదం సంభవిస్తే కోట్లాది రూపాయల ఆస్తులతోపాటు ప్రాణ నష్టం కూడా సంభవించే పెను ప్రమాదముందని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయంపై జలవనరుల శాఖ కలికిరి ఏఈ శ్రీనివాసులు రెడ్డిని వివరణ కోరగా అంకాలమ్మ కుంటకు రెండు గండ్లు పడిన మాట వాస్తవమేనన్నారు. ఒకటి రెండు రోజుల్లో గండ్లు పూడ్చేపని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్తు సేవల్లో లోపాలు లేకుండా చూడండి



విద్యుత్తుశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీడీసీఎల్ సీజీఎం సురేంద్రనాయుడు

మదనపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు సేవల్లో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.సురేంద్రనాయుడు, అధికారులను ఆదేశించారు. నాణ్యమైన విద్యుత్తు సరఫరాతోపాటు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. స్థానిక ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో ఈఈ ఎం.గంగాధర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ట్రిప్పు కాకుండా చూడాలని, అందుకు సంబంధించిన ఏరియాలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే మాత్రం బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయానికి ట్రాన్స్‌పార్మర్లతోపాటు మ్యాచింగ్ మెటీరియల్ కూడా వెంటనే ఇవ్వాలని, సామగ్రి ఇచ్చిన 15 రోజుల్లో సర్వీసు చార్జ్ చేసి వర్క్‌ఆర్డర్ క్లోజ్ చేయాలని స్పష్టం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురైతే రైతును ఇబ్బందులకు గురిచేయకుండా వీలైనంత త్వరగా ఇచ్చేలా చూడాలని చెప్పారు. విద్యుత్తు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని, క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు లైన్లు సరిచూసుకోవాలని తెలిపారు. సూర్యఘర్ పథకం కింద సోలార్ సిస్టం ఏర్పాటును వేగవంతం చేయాలని, ఎక్కడ ఎలాంటి అవసరాలు, ఇబ్బందులు ఉన్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. అనంతరం అధికారులు, సిబ్బంది నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈ విజయ్ భాస్కర్, ఏడీఈలు హరికుమార్, గోవిందరెడ్డి, సురేంద్రనాయక్, ఏఏఓ కిరణ్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

నాబార్డు సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీజీఎం మూర్తి

బి.కొత్తకోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల వృద్ధి, రైతుల సంక్షేమం కోసం వాటర్‌షెడ్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీజీఎం ఎంఎస్ఆర్‌సీ మూర్తి తెలిపారు. బి.కొత్తకోట మండల పరిధిలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో రెండు రోజులు నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా వాటర్‌షెడ్ పనులపై సమీక్షించారు. వాటర్‌షెడ్ నిర్వహణలో ఉత్తమ పద్ధతులను విశ్రాంత అధికారి కేఐ షరీఫ్ వివరించారు. పంచాలమర్రి వాటర్‌షెడ్‌లో గాంధీ సంస్థ నిర్వహించిన పనులను పరిశీలించిన అనంతరం రైతులు, లబ్ధిదారుల అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాబార్డు జిల్లా అధికారులు, ప్రాంతీయ కార్యాలయం, వాటర్‌షెడ్ నిర్వహణ సంస్థలు, గాంధీ అభివృద్ధి సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో సబ్ కలెక్టర్లు



రాజంపేట, మదనపల్లె సబ్ కలెక్టర్లకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న అర్చకులు

రాయచోటిటౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రాకాళీ సమేత వీరభద్రస్వామిని శుక్రవారం రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి దర్శించుకున్నారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వారు వీరభద్రాలయం ప్రాంగణంలోని వినాయకుడు, అఘోరలింగేశ్వరుడు, సుబ్రమణ్యంస్వామి, భద్రకాళీ అమ్మవారు, వీరభద్రుడిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు పట్టు వస్త్రాలు, పూలమాలలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

అండర్ 14 ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మదనపల్లె అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం అండర్ 14 బాలబాలికల ఫుట్‌బాల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్ బాబు, నాగరాజు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు శివ శంకర్, దిలీప్ కుమార్, మురళీధర్, ప్రసాద్, మహేంద్రనాయక్, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు అన్సర్‌బాషా, పార్థసారథి, అంజనప్ప, భద్రయ్య, రుక్మిణీ, ఉమా, దేవకమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు

పీలేరులో అలరించిన అష్టావధానం



అష్టావధానం చేస్తున్న మల్లెల నాగరాజు

పీలేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక భువన విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అష్టావధానం కార్యక్రమం సాహితీ ప్రియులు, విద్యార్థులను అలరించింది. చిత్తూరుకు చెందిన హరివిల్లు సాహితీ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మల్లెల నాగరాజు అవధానిగా, ప్రముఖ కవి, రచయిత వేంపల్లె అబ్దుల్ ఖాదర్ సంధానకర్తగా, భువన విద్యాలయం కరెస్పాండెంట్ ఉమా రమాదేవి అధ్యక్షురాలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ కేవలం తెలుగు వారికే సొంత మైన సాహిత్య క్రీడ అవధానమన్నారు. అవధానం తెలుగు భాషపై మమకారం, తెలుగు సాహిత్యంపై అభిరుచిని కలిగిస్తుందన్నారు. అవధాన ప్రక్రియలో సమస్య పూరణం డాక్టర్ గుడివాడ అన్నయ్య నాయుడు, నిషిద్ధాక్షరి హరివిల్లు సంస్థ వ్యవస్థాపకుడు చలంకోట మునస్వామి, న్యస్తాక్షరి విద్వాన్ ప్రసాద్, దత్తపది తెనాలి శేషగిరి రావు, వర్ణన కలికిరిలోని ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకుడు డాక్టర్ గులాబ్ జాన్, ఆశుకవిగా మదనపల్లె డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు జింకల మోహనవల్లి, అప్రస్తుత ప్రసంగీకుడిగా పాకాల విశ్రాంత డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సంద్ర మోహన నాయుడు వ్యవహరించగా, ప్రముఖ కవి జలకనూరి మురళీధర్ రాజు పురాణ పఠనం చేశారు.

అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ నాయకురాలు సుబ్బరావమ్మ

మదనపల్లె టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం జేసీఎం ఫంక్షన్‌హాల్లో సీఐటీయూ రెండో జిల్లా మహాసభనిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ వ్యవస్థ ఏర్పడి 50 ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు అంగన్‌వాడీ కార్యకర్తలను చిన్నచూపు చూస్తున్నారన్నారు. నామమాత్రపు జీతాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలల వేతన బకాయిలను చెల్లించాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల వేతనాలు పెంచాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. అంతకు ముందు సీఐటీయూ తాత్కాలిక స్థూపం వద్ద వందనాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీదేవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, రాజేశ్వరి, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజులు, కోశాధికారి హరినాథ్‌శర్మ, మదనపల్లె సెక్టార్ నాయకులు మధురవాణి, గంగాదేవి, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మంచి జీవన శైలితో కేన్సర్ దూరం



కేన్సర్ దుష్పరిణామాలను ప్రజలకు వివరిస్తున్న పీలేరు వైద్యులు

పీలేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాజా పండ్లు, ఆకు కూరలు తీసుకోవడం, మద్యం, ధూమపానానికి దూరంగా ఉండడం, వ్యాయామం చేయడం వంటి జీవనశైలితో కేన్సర్‌కు దూరంగా ఉండవచ్చని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. జాతీయ కేన్సర్ నివారణ దినం సందర్భంగా శుక్రవారం ఆస్పత్రిలో అవగాహన కల్పించారు. గతంలో పట్టణ వాసుల్లో ఎక్కువగా కనిపించే పలు రకాల కేన్సర్లు ప్రస్తుతం గ్రామీణుల్లో కూడా కనిపిస్తున్నాయన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనూ కేన్సర్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయన్నారు. ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే ఎటువంటి కేన్సర్‌కైనా చికిత్స ఉందని, అందుకు అందరూ స్వీయ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం పలు రకాల కేన్సర్లపై దంత వైద్య నిపుణురాలు పుష్ప అవగాహన కల్పించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తలపుల పీహెచ్‌సీ సిబ్బంది శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులకుఅవగాహన సదస్సు నిర్వహించారు. వేర్వేరుగా జరి గిన ఈ కార్యక్రమాల్లో వైద్యులు రాజా సాహెబ్, చంద్రశేఖర్ నాయక్, సోమశేఖర రెడ్డి, వసీం, హెచ్ఎఈ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే దుకాణాల సీజ్: ఏడీఏ



గ్రోమోర్‌లో తనిఖీ చేస్తున్న ఏడీఏ రమణరావు, ఏఓ మంజుల

నిమ్మనపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలను సీజ్ చేస్తామని ఏడీఏ రమణరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కందూరు రోడ్డులో వున్న గ్రోమోర్ ఎరువుల దుకాణాలను ఏఓ మంజులతో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, తయారీ తేదీలు, ఎంఆర్‌పీ, బిల్లులు తదితరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతుకు విక్రయించే ప్రతి బస్తాకు బిల్లు ఇవ్వాలని స్టాకు రిజిస్టరులో వ్యత్యాసాలు ఉండరాదని సూచించారు. ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు పీలేరు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం రాణి

పీలేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22, 23 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పీలేరుకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గూడరేవుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినులు ఎం.పూజిత 3 కిలో మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, హార్డిల్స్‌లో పి.లక్ష్మి ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్‌లో కె.పల్లవి ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగులో 9వ తరగతి విద్యార్థినులు కె.పల్లవి ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగులో ఎస్.సురేఖ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగరత్నమ్మ, పీఈటీ రాణి తెలిపారు. కోటపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎస్.జశ్వంత్ హైజంప్‌లో ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం శివశంకరయ్య తెలిపారు. జశ్వంత్, అతనికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు రేణుక, నారాయణ రెడ్డిలను పాఠశాల సిబ్బంది శుక్రవారం అభినందించారు.

బాస్కెట్ బాల్‌లో అక్కా తమ్ముళ్ల ప్రతిభ





సంజన, హేమంత్

రామాపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపగుడిపల్లె, గొల్లపల్లికి చెందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి యనపడ్డ సంజన అండర్ 17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, ఆమె తమ్ముడు హేమంత్ జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో సంజన 9వ తరగతి, హేమంత్ 6వ తరగతి చదువుతున్నారు. వీరి తల్లిదండ్రులు గోవిందు, ఉష వ్యవసాయదారులు. అక్క, తమ్ముడు రాష్ట్ర స్థాయికి, జిల్లా స్థాయికి ఎంపికైనందుకు గ్రామస్థులు అభినందిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీలకు చిట్వేలి విద్యార్థి


చిట్వేలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు తెలియజేశారు. శుక్రవారం రాయచోటిలో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాల వృత్తి విద్య విభాగానికి సంబంధించి ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్‌కు చెందిన మూడు ప్రాజెక్టులు జిల్లా స్థాయికి వెళ్లగా అందులో రఫీ, చేతన, నవిత రూపొందించిన డీహైడ్రేటెడ్ ఫ్రూట్ ఇండస్ట్రీ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. చిన్నబాబు, బృంద, దీక్ష తయారు చేసిన కంప్యూటర్ నెట్‌వర్కింగ్ ప్రాజెక్టు జిల్లా స్థాయి లో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈనెల 11న విజయవాడలో రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలు జరగనున్నాయని ఆయన తెలిపారు. ఈ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయుల బృందం హర్షం వ్యక్తం చేసింది. వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు అభినందించింది.

మద్యం దుకాణానికి రీ నోటిఫికేషన్

ములకలచెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రభుత్వం రీ నోటిఫికేషన్ ఇచ్చిందని ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. తురకపల్లెలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం మూతపడడంతో ప్రభుత్వం రీ నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీ లోపు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. అప్లికేషన్ల స్వీకరణకు కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. అప్లికేషన్ రుసుము రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మద్యం దుకాణం దక్కించుకున్న వారు మండలంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో సమూల మార్పులు

- ఎంపీసీలో మ్యాథ్స్‌కు ఒకటే పరీక్ష
- బైపీసీలో బాటనీ, జువాలజీ కలిపి బయాలజీ
- ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు మార్కుల పెంపు
- మ్యాథ్స్ వంద మార్కులు, బయాలజీ 85 మార్కులు
- ఎంపీసీ, బైపీసీలో ఇక నుంచి ఐదు పరీక్షలే





జాతీయస్థాయిలో ఒకే విధానం

జాతీయస్థాయిలో ఒకే విధానం అమలు చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విధానం ద్వారా విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. సిలబస్ తగ్గించడం ద్వారా సలువుగా ఉత్తీర్ణత సాధిస్తూ మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.
- ఎంఎస్‌వీ వెంకటేశ్వర్లు, ఆర్ఐఓ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో కూటమి ప్రభుత్వం అనేక మార్పులు చేస్తోంది. ఇందులో భాగంగా ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులలోని ఆరు పరీక్షలను ఐదింటికి కుదించింది. ఈ నేపథ్యంలో సబ్జెక్టుల మార్కులు మారాయి.

ఎంపీసీ గ్రూపునకు సంబంధించి మొత్తం మార్కులు 500. రాత పరీక్షలకు 470, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15-ఫిజిక్స్ 15) 30 మార్కులు. ఇప్పటి వరకు మ్యాథ్స్ సబ్జెక్టును రెండు పేపర్లుగా నిర్వహిస్తున్నారు. పేపర్ 1ఏకి 75 మార్కులు, పేపర్ 1బికి 75 మార్కులు మొత్తం 150 మార్కు లతో పరీక్షలు జరిగేవి. ఇకపై 100 మార్కులతో ఒకే పేపరు నిర్వహిస్తారు. పాస్ మార్కులు 35. ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85, ఫస్ట్ సెకండ్ లాంగ్వేజ్‌కు వంద మార్కులు చొప్పున రెండు పరీక్షలు నిర్వహిస్తారు.

బైపీసీ గ్రూపులో మార్కులు మొత్తం 500, రాత పరీక్షలకు 455, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15, ఫిజిక్స్ 15+బోటనీ, జువాలజీ 15) మొత్తం 45 మార్కులు. బోటనీ 60 మార్కులకు, జువాలజీ 60 మార్కులకు రెండు పేపర్లు ఉండేవి. ఇపుడు ఈ రెండు కలిపి 85 మార్కులుగా ఒకే ప్రశ్నాపత్రంగా ఇస్తారు. ఆన్సర్ షీట్లు మాత్రం రెండుగా ఉంటాయి. బోటనీ 43 మార్కులు, జువాలజీ 42 మార్కులుగా ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణత 29.5 మార్కులుగా నిర్ధారించారు. కానీ అరమార్కు ఉండదు. 29 మార్కులు వస్తే ఉత్తీర్ణతగా తీసుకుంటారు. ఫిజిక్స్ 85కి, కెమిస్ట్రీ 85 మార్కులకు ఉంటుంది. ఫస్ట్, సెకండ్ లాంగ్వేజీలకు వంద మార్కుల చొప్పున పరీక్ష పత్రాలు ఇస్తారు. ఈ విధానంలో ఫస్టియర్ పరీక్షలు రాసిన విద్యార్థులు సెకండ్ ఇయర్‌లోను కొనసాగిస్తారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పాత విధానంలోనే ప్రశ్నపత్రాలు ఉంటాయి.

కళాశాలలు, విద్యార్థుల వివరాలు

2025-26 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 151 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 17600 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు పొందారు. అందులో 7957 మంది బాలురు, 9643 మంది బాలికలు ఉన్నారు. ప్రభుత్వ కళాశాలలు, ప్లస్ 2 కళాశాలల్లోని విద్యార్థులకు ప్రశ్నపత్రాలపై అవగాహన పెంచేందుకు ఒరియంటల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రశ్న పత్రాలు రూపకల్పన చేసి వాటి విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యా ర్థుల్లో ఉత్తీర్ణత పెంచే దిశగా విద్యాబోధన జరుగుతోంది.

- జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 20 ఉన్నాయి. వీటిలో 2837 మంది విద్యార్థులు చేరగా, అందులో 1086 మంది బాలురు, 1751 మంది బాలికలు ఉన్నారు.
- హెచ్ఎస్‌ప్లస్ (హయ్యర్ సెకండరీ ప్లస్) విభాగంలో 9 కళాశాలల్లో 217 మంది బాలికలు మాత్రమే చేరారు. అలాగే జిల్లాలోని 17 కేజీబీవీ (కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు)ల్లో 567 మంది బాలికలు ప్రవేశించారు.
- మోడల్ స్కూళ్లలోని మూడు కళాశాలల్లో 202 మంది విద్యార్థులు (31 మంది బాలురు, 171 మంది బాలికలు) అడ్మిషన్లు పొందారు.
- జిల్లాలోని ఐదు ఎయిడెడ్ కళాశాలల్లో 352 మంది (270 మంది బాలురు, 82 మంది బాలికలు) చేరారు.
- జిల్లా వ్యాప్తంగా 79 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 12,316 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. వీరిలో 6142 మంది బాలురు, 6174 మంది బాలికలు ఉన్నారు.
- జిల్లాలోని 11 సోషియల్ వెల్ఫేర్ కళాశాలల్లో 634 మంది విద్యార్థులు (191 మంది బాలురు, 443 మంది బాలికలు) ఉన్నారు.
- జిల్లాలో 7 కళాశాలల్లో ఒకేషనల్ కోర్సుల్లో 475 మంది విద్యార్థులు (237 మంది బాలురు, 238 మంది బాలికలు) ఉన్నారు.

పశువులకు మెరుగైన సేవలు అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జేడీ

కాశినాయన నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పశువైద్యులు ప్రజలకు అందు బాటులో ఉండి మూగ జీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా పశు సంవర్థకశాఖ జేడీ డాక్టర్ ఎస్ఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపురం పశువైద్యశాలను పోరుమామిళ్ళ ఏడీ డాక్టర్ కె.చంద్ర శేఖర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మూగ జీవాలకు గొంతువాపు వ్యాధి సంక్రమించకుండా ముందస్తు టీకాలు వేయాలన్నారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. మందులు కొరతపై ఆరా తీశారు. కార్యక్రమంలో కడప డీడీ డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి, నర్సాపురం పశువైద్యుడు డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు



మైదుకూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధరణి తిమ్మాయపల్లె అవధూత కొండయ్యస్వామి 44వ జన్మదిన వేడుకల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన పెద్ద బండలాగుడు పోటీలు పోటాపోటీగా జరిగాయి. ఈ పోటీలను కొండయ్యస్వామి ఉదయం 9గంటలకు ప్రారంభించారు. చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎడ్లు ప్రథ మ స్థానంలో నిలిచి రూ.1,58,118 బహుమతి సాధించాయి. కల్లూరుకు చెందిన పెరుమాళ్ల శివక్రిష్ణయాదవ్ ఎడ్లు రెండో బహుమతి కింద రూ.1,08, 118లు, బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్లు మూడో బహుమతి రూ.75,118 గెలుచుకున్నాయి. అలాగే నాల్గవ బహుమతి రూ.50,118, ఐదో బహుమతి రూ.25,118లను నంద్యాల జిల్లా కొత్తూరుకు చెందిన కేథార్, శర్వణరెడ్డికి చెందిన ఎడ్లు విజయం సాధించాయి. విజేతలకు కొండయ్యస్వామి బహుమతులను అందచేశారు.

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం బీఓఎస్ సభ్యుడిగా వైవీయూ అధ్యాపకుడు

కడప ఎడ్యుకేషన్,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు తెలంగాణాలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం లలితకళా విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) సభ్యుడిగా నియమితులయ్యారు. ఆ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానం దరావు ఆదేశాల మేరకు నామినేట్ చేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. సభ్యుడిగా మూడేళ్లుగా సిలబస్, విధివిధానాల రూపకల్పనలో మృత్యుంజ యరావు సేవలు అందించనున్నారు.

రిమ్స్‌లో అరుదైన క్యాన్సర్‌కి శస్త్రచికిత్స



శస్త్రచికిత్స విజయవంతం సందర్భంగా వైద్యబృందం

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో శుక్రవారం ఓ మహిళకు అరుదైన మరియు క్లిష్టమైన కుడ భుజపు ఎముక ప్రాంతంలో వచ్చిన కాండ్రో సార్కోమా క్యాన్సర్‌కి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించినట్లు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సత్యసాయి జిల్లా కదిరి తాలూకా భద్రేపల్లెకి చెందిన 60 ఏళ్ల మహిళ అక్టోబరు 27న శస్త్రచికిత్స కోసం సర్వజన ఆసుపత్రిలో చేరారు. వైద్య పరీక్షల అనంతరం నవంబరు 5న ఆమెకు డాక్టర్ అమానుల్లా ఆధ్వర్యంలో వైద్యులు శస్త్రచికిత్సను వియవంతంగా నిర్వహించారు. టీకోఫ్ లిన్బర్గ్ అనే శస్త్రచికిత్స పద్ధతి ద్వారా క్యాన్సర్ గడ్డతో పాటు పూర్తిగా స్కాపులా ఎముక, డిస్టల్‌క్లావికిల్ (మెడ ఎముకకొంత భాగం) మరియు ప్రోక్సిమల్ హ్యూమరస్ (మోచేతిపై ఎముక కంత భాగం తొలగించి రోగి భుజం, చేయి పనితీరును రక్షించగలిగారు. రోగి ప్రస్తుతం పూర్తిగా కోలుకుంటూ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ సునీల్, ఆర్థోపెడిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రామమనోహర్, ప్లాస్టిక్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నబ్మా, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో పనులపై విచారణ



రోడ్ల కొలతలు పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పలు అభివృద్ధి పనులలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని, అంతవరకు బిల్లులు చెల్లించకూడదని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మార్చి 20న మున్సిపల్ మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు మంత్రి మార్చి 26న ప్రొద్దు టూరు మున్సిపాలిటీలో జరిగిన పనులకు బిల్లులు చెల్లింపు జరప కుండా నిలిపివేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో గత ఏడాదికి పైగా బిల్లులు చెల్లింపులు జరగక కాంట్రాక్టర్లు వడ్డీలు కట్టుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో 16 మంది కాంట్రాక్టర్లకు మొత్తం రూ.7.05 కోట్ల మేర బిల్లులు నిలబ డిపోవడంతో వారు పలుమార్లు మున్సిపల్ అధికారులను, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి అవకతవకలపై త్వరగా విచారించి బిల్లులు చేయాలని కోరారు. ఆమేరకు అనంతపురం పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సతీష్ చంద్ర (అనంతపురం), ఈఈ రమణ మూర్తి (కడప), డీఈలు కావ్య (కడప), గురునాథ్‌రెడ్డి (పులివెందుల)లను విచారణ అధికారులుగా నియమించారు. అక్టోబరు 21న కమిషనర్ రవిచంద్రారెడ్డికి, ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో గత మూడు రోజులుగా డీఈ గురునాథ్‌రెడ్డి 2014 నుంచి 2019 వరకు జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డు చేస్తున్నారు. ఈ విచారణ పూర్తి చేసి నివేదిక ఇచ్చిన అనంతరం సంబంధింత పనుల్లో అవకతవకలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామని, లేకపోతే బిల్లుల చెల్లింపులకు సిఫారస్సు చేస్తారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్పీలకు సర్టిఫికెట్లు ప్రదానం

పులివెందుల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా శిక్షణ పొందిన ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఏపీకార్ల్‌లోని వ్యవసాయ కళాశాలలో ఐసీఆర్పీలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశాలపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను తెలయజేసి రైతులను చైతన్యవంతులు చేయాలన్నారు. ఘన, ద్రవ జీవామృతాల తయారీ, ఉపయోగాలు తదితర అంశాలను శిక్షణలో వివరించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసేలా పూర్తి అవగాహన కల్పించాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఏపీకార్ల్‌లో ఏఓ శివారెడ్డి, ప్రకృతి వ్యసాయ డీజీఎం ప్రవీణ్‌కుమార్, అడిషనల్ డీపీఎం వసంతకుమారి, డీఆర్‌డీఏ ఏపీఎంలు గురురాజ్, ఆంజనేయులు, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు సురేష్, ఉషారాణి, మనోజ్‌ల చేతులమీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

స్వేచ్ఛతో పాటు బాధ్యతలను నేర్పించండి

- తల్లిదండ్రులకు సైకాలజిస్ట్ సునీత సూచన



బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పులివెందుల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు స్వేచ్ఛతో పాటు బాధ్యతను నేర్పించాలని కడప వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్, సైకాలజిస్ట్ సునీత సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బేటి బచావో బేటి పఢావో కార్యక్రమంలో భాగంగా బాలికే భవిష్యత్తు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు స్వేచ్ఛను ఇస్తున్నారని, ఆ స్వేచ్ఛను ఆసరాగా తీసుకొని అడ్డమైన తిరుగుల్లు తిరుగుతున్నారన్నారు. అనంతరం ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తమ పిల్లలకు ధైర్యం చెప్పడం లేదన్నారు. ఒక సర్టన్ ఏజ్ వచ్చాక పిల్లల్లో వచ్చే మార్పులను తల్లిదండ్రులు గమనించాలన్నారు. బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలియజెప్పాలన్నారు. బాలికలు, యువతులు, మహిళలు ఏదైన సమస్యల్లో ఉంటే 181 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. పోష్ యాక్ట్, పోక్సో యాక్ట్‌ల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అనంతరం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దు తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ విశ్వనాథరెడ్డి, ఎంఈఓ రామానాయుడు, ఏఓ రామాంజనేయ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ మాబున్ని, అంగన్వాడీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీరంగా సేవలు మరువలేనివి

పులివెందుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు ఆచార్య ఎన్జీరంగా చేసిన సేవలు మరువలేనివని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ కొనియాడారు. శుక్రవారం ఆచార్య ఎన్జీరంగా జయంతి సందర్భంగా కళాశాలలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా డీన్ మాట్లాడుతూ ఎన్‌జీ రంగా సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యునిగా ఉండి రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్‌లో స్థానం పొందారన్నారు. రైతుల సమస్యలపై గళమెత్తిన ఆచార్యా రంగా పాలకులను ఒప్పించి రైతు అనుకూల నిర్ణయాలు వచ్చేలా చేశారన్నారు. ఆచార్య ఎన్జీరంగా పేరు మీద ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మనం ఉన్నాం కాబట్టి రైతులకు సేవలందించి ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దామన్నారు. అలాగే వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సామూహిక వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ జయమ్మ, డాక్టర్ రాజేష్, ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్‌బాషా, డాక్టర్ ప్రదీప్‌కుమార్, కుమారి మాధవి, ఎన్‌వి సుబ్బారెడ్డి, పీడీ డాక్టర్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

10, 11 తేదీలలో డి-ఫార్మసీ అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఎంపీసీ, బైపీసీ అర్హత గల విద్యార్థినీ విద్యార్థులు డి-ఫార్మసీ కోర్సు అడ్మిషన్ల కోసం నవంబరు 10, 11 తేదీలలో ఉదయం 10గంటలకు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్‌తో పాటు ప్రాసెసింగ్ ఫీజు ఓసీ/బీసీలకు రూ.1200, ఎస్సీ, ఎస్టీలకు రూ.600 ఆన్‌లైన్‌లో చెల్లించి రసీదు తీసుకురావాలని సూచించారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ పాసైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7981353745, 9440144057 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కారు, వ్యాను ఢీ - అయిదుగురికి గాయాలు



చాపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు, మైదుకూరు జాతీయ రహదారిలోని మండల కేంద్రమైన చాపాడు పెట్రోలు బంకు వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయిదుగురు వ్యక్తులు గాయపడ్డారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. మైదుకూరు నుంచి వస్తున్న ఒక కారు పెట్రోలు బంకు వద్దకు రాగానే ఎదురుగా ఒక మోటారు సైకిల్ అడ్డు రావడంతో దానిని తప్పించబోయాడు. ఆ సమయంలో ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వైపు వస్తున్న వ్యాను ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో మూడు వాహనాల్లోని కొండారెడ్డి, వెంకటశేషు, షరీఫ్, పద్మావతి, కొండ్రాయుడుల చేతులకు, తలలకు గాయాలయ్యాయి. చాపాడు పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేస్తారని తెలిపారు.

కేబుల్ వైరు చోరీ

పులివెందుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కె.వెలమవారిపల్లెలో శుక్రవారం గుర్తు తెలియని వ్యకులు కేబుల్‌వైర్ చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. రైతు మధుసూధన్‌రెడ్డి తన పొలంలో ఉన్న ఫాంహౌస్‌లో కేబుల్ వైరును ఉంచారు. తన పని నిమిత్తం కొద్ది రోజులుగా ఫాంహౌస్‌కు వెళ్ల లేదు. అనంతరం ఫాంహౌస్‌కు వెళ్లి చూడగా కేబుల్ వైరు చోరీకి గురైందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.1.30 లక్షలు విలువ చేస్తుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమపేరుతో బాలికను తల్లిని చేసిన యువకుడు

- పోక్సో కేసు నమోదు

కడప క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న ఓ 17 ఏళ్ల బాలికను అదే కళాశాలలో సీనియర్‌గా చదువుకుంటున్న యువకుడు ప్రేమ పేరుతో తల్లిని చేశాడు. ఆ బాలిక గురువారం ఆసుపత్రిలో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. కడపలోని వసతి గృహంలో ఉంటూ కాలేజీకి వెళ్లి తిరిగి హాస్టల్‌కు వస్తుండేది. కనీసం ఆ బాలిక గర్భంతో ఉన్న విషయాన్ని తోటి విద్యార్థులు కానీ, హాస్టల్ నిర్వాహకులు గుర్తించలేకపోవడం విశేషం. బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కింద కేసు నమోదు చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా బెస్తవారిపల్లెకు చెందిన శ్రీకాంత్ కడపలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎమ్.ఎల్.టి చదువుతున్నాడు. అదే కళాశాలలో జూనియర్‌గా చదువుతున్న బాలికను ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. గురువారం కడుపు నొప్పి రావడంతో హాస్టల్ నిర్వహకురాలు వైద్య పరీక్షలు నిమిత్తం ఆసుపత్రికి తరలించగా ఆ బాలిక బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో యువకుడుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమమైనింగ్‌పై దాడులు

- క్రేన్‌లను సీజ్ చేసిన అధికారులు

వేముల, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరగుట్టలో అక్రమమైనింగ్ చేస్తున్న ముగ్గురాయి తవ్వకాలపై ఏడీఎంజీ అధికారులు ఏడీఎంజీ అధికారులు దాడులు చేసి క్రేన్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సీజ్ చేసిన క్రేన్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ ముగ్గురాయి తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతామని ఏడీఎంజీ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీ మైన్స్ విజిలెన్స్ క్రిష్ణమూర్తి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు రాధ, విమలమ్మ, రామసుబ్రమణ్యం, టీఏ అంబాని, తహసీల్దార్ రెడ్డిలక్ష్మి, ఆర్ఐ ప్రసన్న, వీఆర్ఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో జైలు శిక్ష, జరిమానా

ఎర్రగుంట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లకు చెందిన బంగ్లా రమేష్‌ను కులం పేరుతో దూషించి కొట్టిన కేసుకు సంబందించి ఇద్దరికి కడప న్యాయమూర్తి మూడేళ్ల సాధారణ జైలు శిక్ష రూ.1000 జరిమానా విధించారు. ఎర్రగుంట్లకు చెందిన షేక్ మహమ్మద్ గౌస్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా బంగ్లా రమేష్ పని చేస్తున్నాడు. కొంత మొత్తాన్ని అడ్వాన్స్ తీసుకున్నాడు. అయితే పనికి రాకపోవడంతో మహమ్మద్ గౌస్, షేక్ ఖాసీంతో కలిసి రమేష్ ఇంటి వద్దకు వెళ్లి కులం పేరుతో దూషించి కొట్టాడు. ఈ విషయంపై బాధితుడు ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 2019లో అప్పటి సీఐ సదాశివయ్య కేసు నమోదు చేయగా డీఎస్పీ సూర్యనారాయణ కేసును విచారణ చేశారు. ఈ కేసును విచారణ చేసిన కడప నాల్గవ ఏడిజే కోర్టు జడ్జి జి.దీనబాబు నిందితులకు మూడు సంవత్సరాల పాటు సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా నున్న మూడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో అలాగే విద్యుత్ లైన్లల్లో మరమ్మతుల కారణంగా ఉదయం శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పులివెందుల టౌన్..: పులివెందుల పట్టణంలో శనివారం పలు సబ్‌స్టేషన్‌లు మెయింటెనెన్స్ చేయనున్నామని విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కడప నాగరాజుపేట..: కడప పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కడప టౌన్-2 సబ్‌డివిజన్ డీఈఈ బి.లక్ష్మానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్రాసుపల్లె, రెడ్డికాలనీ, పకీరుపల్లె, ఓంశాంతినగర్, అబ్దుల్ కలాంకాలనీ,చిన్నచౌక్ విద్యామందిర్ స్కూల్, భాగ్యనగర్‌కాలనీ, దేవుని కడప, గౌస్‌నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లె రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతిబార్, ద్వారకానగర్, సంధ్యాసర్కిల్, ఎర్రముక్కపల్లె, సీపీబ్రౌన్, మున్సిపల్ ఆఫీస్, ఆర్టీసీ బస్టాండ్,పటేల్‌రోడ్డు, అరవింద్‌నగర్, తేజ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ వేడుకలు

కడప, ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెడెన్ పావెల్ సేవలు చిరస్మరణీయమని డీఓసీ రమణయ్య తెలిపారు. శుక్రవారం కడప నగరం శకంరాపురం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్ బాష స్కౌట్ మాస్టర్ సగినాల అహమ్మద్ బీఎస్‌జీ, డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు,వెంకటసుబ్బయ్య, యూనిట్ లీడర్లు పాల్గొన్నారు.

రిమ్స్‌లో నీటి సరఫరా పరిశీలన



రిమ్స్ నీటి వ్యవస్థను పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి శుక్రవారం రిమ్స్‌లో నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. కడపలో ఉన్న గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి రిమ్స్‌లో నీటి సమస్యను పర్యవేక్షక అధికారులతో కమిషనర్ చర్చించారు. ఈ పర్యటనలో, కార్పొరేషన్ సిబ్బంది ఎస్ఈ, ఈఈ, డిప్యూటీ ఈఈ, ఏఈ రిమ్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు మహిళా పక్షపాతి



ఎమ్మెల్యే మాధవి

కడప మారుతీనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు మహిళా పక్షపాతి అని మరో మారు నిరూపించుకునేలా ఇటీవల జరిగిన ప్రపంచ మహిళా వరల్డ్ కప్‌లో మన ఇండియా మహిళా జట్టు సమష్టిగా రాణించి కప్‌ను కైవసం చేసుకోవడంలో మన కడప జిల్లా క్రీడాకారిణి శ్రీ చరణి కీలకంగా వ్యవహరించడం చాలా గర్వకారణమని టీడీపీ కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ద్వారకానగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కప్ గెలిచిన తర్వాతా శ్రీ చరణి మర్యాద పూర్వకంగా చంద్రబాబు నాయుడు, లోకేశ్‌ను విజయవాడ సీ.ఎం. క్యాంపు కార్యాలయంలో కలిసిందన్నారు. కాగా ప్రభుత్వం తరఫున శ్రీ చరణికి రూ.2.50 కోట్ల రూపాయల నగదుతో పాటుగా గ్రూప్-1 ఉద్యోగ అవకాశం, అలాగే కడపలో 1000 చదరపు గజాల స్థలం కేటాయింపు చేసేలా ఆదేశాలివ్వడం చాలా గొప్పవిషయమన్నారు. టీడీపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, నగర అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్ పాల్గొన్నారు.

దేశభక్తి స్ఫూర్తి మంత్రం.. వందే మాతరం



పులివెందుల అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో వందేమాతరం గీతాలాపనలో విద్యార్థులు

పులివెందుల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరగేయానికి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆ గేయం ఆలపించడంతో శుక్రవారం పులివెందుల పరిధిలోని అన్ని విద్యాలయాలు మార్మోగాయి. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో వందేమాతరం గేయం పాత్రను గుర్తుకు చేసుకుంటూ భారత ప్రభుత్వం వందేమాతరం గేయాన్ని ఏకసమయంలో ఆలపించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో వందేమాతరం గీతాన్ని విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆలపించారు.

కడప మారుతీనగర్..: తెల్లదొరల బానిస సంకెళ్ల నుంచి మన భారతదేశన్ని విముక్తి కల్పించాలనే ధ్యేయంతో 1875 నవంబరు 7న బంకించంద్ర చటర్జీ వందేమాతరం గేయం రూపకల్పన చేసినట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం. బాలకృష్ణయాదవ్, సీనియర్ నాయకుడు గోసుల శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. వందేమాతర గేయం రూపకల్పన అయి 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బీజేపీ జిల్లా సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాణి స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేంద్ర, జనార్దన్‌రెడ్డి, పద్మావతిబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్..: వందేమాతరం జాతీయగేయం 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా కడపనగరం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం ఉదయం 10గంటలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా వందేమాతరం గీతాన్ని సమూహగానంగా ఆలపించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌ఏడీ శామ్యూల్, డీఈఓ డాక్టర్ షంషుద్దీన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంపల్లె..: భారతదేశ సమైక్యతను దేశ స్ఫూర్తి, దేశభక్తిని మతాలు, కులాలు, ప్రాంతాలకతీతంగా కలిపేలా వందేమాతరగేయం పనిచేసిందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా స్థానిక నారాయణ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో తులసిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. అలాగే సీవీ రామన్ 136వ జయంతి సందర్భంగా నారాయణ స్కూల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె..: దేశ స్వాతంత్ర్య పోరాటానికి వందేమాతరం గీతం స్ఫూర్తిగా నిలిచిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ తెలిపారు. స్థానిక చైతన్య హైస్కూల్లో వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా వందేమాతరం గేయాలాపన చేశారు. చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అమ్మవారిశాలలో ఆవోపా అధ్యక్షుడు సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో వందేమాతరం గేయాలాపన చేశారు.

కడప కలెక్టరేట్..: యావత్ భారతావనిలో దేశ భక్తిని నింపే స్ఫూర్తిమంత్రం వందేమాతర గేయమని జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి వెంకటపతి పేర్కొన్నారు. వందేమాతరం గేయరచన 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో శుక్రవారం వందేమాతరం సామూహిక గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వోతో పాటు గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ హాజరయ్యారు. ఈకార్యక్రమంలో గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, కలెక్టరేట్ ఏవో విజయకుమార్, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కడప క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డుప్రమాదాలు,నివారణ అనే అంశంపై ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కడప ట్రాఫిక్ సీఐ జావీద్ శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ధన్వంతరి జయంతి

కడప మారుతీనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భగవాన్ ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని నాయీ బ్రాహ్మణ సామాజిక స్పందన కడప వారి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు నగర పాత రిమ్స్‌లో ఉన్న బీసీ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం జరుగనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత ఐపీఎస్ (ఎన్‌ఈడబ్ల్యుఎస్) వ్యవస్థాపకుడు (విజయవాడ) రవీంద్రనాథ్ బాబు, జీఏసీ విశ్రాంత ప్రిన్సిపాల్ (హైదరాబాద్) సారంగపాణి హాజరుకానున్నారన్నారు. జిల్లాలోని నాయీ బ్రాహ్మణ వర్గీయులు తప్పక హాజరై వేడుకలను దిగ్విజయం చేయాలని కోరారు.

ఆర్పీలకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలి

కడప సెవన్ రోడ్స్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఆర్పీలకు ప్రభుత్వం ప్రకటించినట్లుగా శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఆర్పీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మెప్మా ఉద్యోగుల మాదిరిగానే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్పీల యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా , విజయక్రాంతి, విజయకళావతి రెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా అంతర పంటలు

లింగాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అరటిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అంతర్‌పంటల సాగుచేపట్టాలని మండల ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి జయనాయక్ తెలిపారు. మండలంలోని ఇప్పట్ల గ్రామంలో శుక్రవారం రైతు వెంకటరామిరెడ్డి పొలంలో రైతులకు అంతర్‌పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ జయలక్ష్మి, ఎంఎంఎల్‌ఎఫ్ భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ వాష్ ..అండ్ గో



కడప క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఫేష్ వాష్ అండ్ గో.. కార్యక్రమాన్ని పోలీసులు శుక్రవారం చేపట్టారు. జిల్లాలోని రహదారులపై బ్లాక్‌స్పాట్స్ గుర్తించి ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసుఅధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక లారీలు,బస్సులు, వ్యాన్లు, కార్లు తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపుతున్నారు.

పరిశోధక పుస్తకం ఆవిష్కరణ



కడప ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రభుత్వం పురుషుల కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అంతర్జాతీయ సదస్సు సందర్భంగా సింఫోని ఆఫ్ ఇంటిగ్రేటెడ్ బయాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ పరిశోధక పుస్తకాన్ని ఆవిష్కరించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ డి.వీరనాగేంద్రకుమార్ కన్వీనర్‌గా వ్యవహరించారు. దేశవ్యాప్తంగా 70కి పైగా పరిశోధకులు తమవ్యాసాలు సమర్పించారు. ఎడిటర్స్‌గా డాక్టర్ వీర నాగేంద్రకుమార్, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మహేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్‌రమేష్, డాక్టర్ రవిశేఖర్, డాక్టర్ సావిత్రి, నవనీశ్వర్‌రెడ్డి, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

వైసీపీ విధ్వంసం చేస్తే కూటమి రోడ్లు వేస్తోంది

టీడీపీ నేతలు



వేంపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో వేంపల్లెలో రోడ్లన్నీ విధ్వంసం చేసి ఎక్కడ రోడ్లు అక్కడ వదిలేయగా కూటమి పాలనలో ఆ రోడ్లను వేస్తోందని టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ బాలస్వామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాజాగా సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4.50కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, మండల కార్యదర్శి తక్కెళ్ల షరీఫ్, టీఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్జీరంగా జయంతి



కేవీకేలో మొక్కలు నాటుతున్న అంకయ్యకుమార్, క్రిష్ణప్రియ

సీకేదిన్నె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా జయంతి వేడుకలు కృషివిజ్ఞాన కేంద్రం ఊటుకూరు నందు ఘనంగా నిర్వహించినట్లు కేవీకే సమన్వయకర్త, డాట్ సెంటర్ సమన్వయకర్త అంకయ్యకుమార్, క్రిష్ణప్రియ తెలిపారు. 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీకాంత్, అగ్రికల్చరల్ విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కాగా విద్యార్థులు స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కొర్రపాటి సునీల్‌కుమార్ తెలిపారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ఆచార్య ఎన్జీరంగా 125 జయంతి, వందమాతరం గేయం 150 సంవత్సరాలు సందర్భంగా విద్యార్థులు ఎన్జీరంగ చిత్రపటానికి నివాళుల ర్పించి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధనాపద్ధతులు అవసరం

చెన్నూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెరుగైన బోధనాపద్ధతులు అవసరమని ఎంఈవో గంగిరెడ్డి అన్నారు. రెండురోజులు పాటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించారు. సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ టీచ్ టూల్ (సాల్ట్) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణలో మండల వ్యాప్తంగా పది మందికి శిక్షణ ఇస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతులను మెరుగుపరచాలి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు7 (ఆంధ్ర జ్యోతి): కడప నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నా యని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ డిమాండ్ చేశారు. శుక్రవారం 50 డివిజన్ పాలెంపల్లె, రూకారిపల్లె, బచ్చుంపల్లెలో స్థానిక మౌలిక సమస్యలను పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉదయం 10గంటలకు జరిగే ఆందోళనలో ప్రజలు పాల్గొనాలని వారుకోరారు. సీపీఐ సీనియర్ నాయకుడు మనోహర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

కడప క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్దన్‌నాయుడు కడప విద్యుత్ భవన్‌లోని విజిలెన్స్ విభాగంలో శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి తగు సూచనలు సలహాలు తెలిపారు. విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు విధిగా దాడులు నిర్వహించాలని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టి విద్యుత్ చౌర్యం అరికట్టాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ పి.నరసింహారెడ్డి, ఎస్ఐ ఎం.మధుసూదన్‌రెడ్డి, హుసేన్ పాల్గొన్నారు.

'రోగులు, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షంగా కార్మికులు, పరోక్షంగా రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న పద్మావతి శానిటేషన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో పద్మావతి కాంట్రాక్ట్ వారు పారిశుధ్యం మీద శ్రద్ధ పెట్టకుండా గతంలో పనిచేస్తున్న వర్కర్లను తొలగిస్తూ, తొలగించిన పోస్టులను డబ్బులు వసూలు చేసుకొని నియమించుకోవాలని ఉద్దేశ్యం ఉన్నట్లు స్పష్టంగా కనపడుతోందన్నారు.



ప్రముఖ క్రికెటర్ శ్రీచరణిని అభినందిస్తున్న జనసేన నాయకుడు జీవీ రమణ

విద్యార్థులు చదువుకునేది ఎలా..?



కడప ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుంటే విద్యార్థులు ఎలా చదువుకునేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు జి.వలరాజు, బి.నాసర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విశ్వవిద్యాలయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కారానికై ఈనెల 22వ తేదీన ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమైన బస్సు జాత శుక్రవారం ఉదయం కడపకు చేరుకుంది. ఈ సందర్భంగా కోటిరెడ్డి సర్కిల్ నుంచి జిల్లా పరిషత్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అక్కడ బహిరంగ సభ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శివతేజ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌సిప్ (పీపీపీ) పేరుతో ప్రభుత్వ వైద్యకళాశాలలు ప్రైవేట్‌పరం చేస్తే పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ నాయకుడు గాలి చంద్ర మాట్లాడుతూ యోగివేమన యూనివర్సిటీలో ప్రొఫెసర్లు లేక యూనివర్సిటీకి నిధులు కేటాయించక డిపార్ట్‌మెంట్లు మూతపడుతున్నాయన్నారు. సభలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ షేక్ మస్తాన్, షరీఫ్, కోటేశ్వరరావు, నాగభూషణం ప్రసంగించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చంద్ర, అరుణ్, అఖిరానందన్,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఎంతో అవసరం



కడప..అవగాహన కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను గుర్తించాలంటే స్క్రీనింగ్‌తోనే సాధ్యమని ప్రజలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని క్యాన్సర్ కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వంశీవిహారి అన్నారు. కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని క్యాన్సర్ కేర్ ఆసుపత్రిలో శుక్రవారం క్యాన్సర్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సీసీసీ కడప (క్యాన్సర్ కేర్ సెంటర్)లోని ప్రముఖ అంకాలజిస్టులు డాక్టర్ అమానుల్లా, డాక్టర్ వంశీవిహారి, డాక్టర్ పవన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్‌కు సంబంధించిన ప్రారంభ లక్షణాలు, నిర్ధారణ విధానాలు మరియు నిరోధక చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ఏఎన్ఎమ్‌లు,స్టాఫ్ నర్సులలు పాల్గొన్నారు.

చెన్నూరు..: క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమవుతుందని ఆర్‌హెచ్‌టీసీ వైద్యులు డాక్టర్ సాయిచందన, డాక్టర్ విజయకుమార్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్ర ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సిబ్బంది సుబ్బరామయ్య. లక్ష్మీదేవి, రెబక,షణ్ముఖుడు, మోహన్‌రెడ్డి, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె..: క్యాన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా తాళ్లపల్లె ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, స్థానిక ప్రజలు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, ఝాన్సీ, హెల్త్ ఎడ్యుకేటర్ షఫిఉన్నీస తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్..: చక్కని జీవన శైలి ద్వారా క్యాన్సర్‌ను దూరం చేయవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాస్త్రశాఖ సహ ఆచార్యులు డాక్టర్ కె.లలిత అన్నారు. శుక్రవారం జాతీయ సేవా పథకం యూనిట్-4, 7 ఆధ్వర్యంలో క్యాన్సర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, రమణ, ఎంబీఏహెచ్‌ఆర్‌ఎం విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లి రైతు బాధలు పట్టవా..?

- పంట వదలివేసిన పాలంలోని ఉల్లి గడ్డలు తీసుకెళుతున్న ప్రజలు
- పశువుల మేతకు వదిలేసిన పైరు
- పాలాల్లో ఉల్లిపైరు తొలగిస్తున్న రైతులు
- 40 ఏళ్లలో ఈ దుస్థితి లేదంటున్న వైనం


పాలంలో వదలివేసిన ఉల్లి గడ్డలు తీసుకెళుతున్న జనం

దువ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుల బాధలు ఎవరికి పట్టడంలేదంటూ బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి కష్టం ఎవరికి కనుడకపోవడంతో తోటలను తుడిపేస్తున్నారు. అధికారులు ఏమీ స్పందించకపోగా పాలకులు కనీసం కనికరం చూపడంలేదంటూ వాపోతున్నారు. అదిగో కొంటారు, ఇదిగో కొంటారు అని ఎదురుచూసి కళ్లకు కాయలు కట్టాయే తప్ప సమస్య తీరడంలేదంటున్నారు. పంట తీసే కాల వ్యవధి దాటి 20 నుంచి 30 రోజులు అదనంగా గడిచినా వానదేవుడి ప్రతాపం కొనసాగుతుండడంతో రైతు కంట కన్నీళ్లు కారడం తప్ప ఒరిగిందేమీ లేదు. ఈ కాల వ్యవధిలో కుళ్లు సోకి ఉల్లి గడ్డలు పాడవుతుండడంతో రైతులు కాలయాపనతో ప్రయోజనం లేదని చాలా మంది తోటలను తుడిపేస్తున్నారు. కొందరు మందు పిచికారితో, మరికొందరు ట్రాక్టర్ల సేద్యం చేసి కష్టాన్ని నేలపాలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ప్రజలు అందుబాటులో ఉన్న తోటలకు వెళ్లి సంబంధిత యజమానుల అనుమతితో గడ్డలు ఊరికే తీసుకెళుతున్నారు. ఈ తరహా సంఘటనలు దువ్వూరుతోపాటు చుట్టుపక్కల మండలాల్లో కొనసాగుతున్నాయి. పశువుల మేతకు సైతం పంటను వదిలిపెడుతున్నారు. ఉల్లి కొనుగోలు చేయని సంఘటనలు 40 ఏళ్ల అనుభవంలో చూడలేదని పెద్దసింగనపల్లెకు చెందిన నాగిరెడ్డి అనే రైతు తెలిపారు. దువ్వూరులో కుళ్ల శ్రీనివాసులు అనే రైతు రెండున్నర ఎకరంలో పంటను తుడిచిపెట్టే పురుగు మందును పిచికారి చేశారు. ఇదే తోటలో స్థానిక ప్రజలు వచ్చి ఉల్లిగడ్డలు తొలగించి గంపలకు, సంచులకు నింపుకొని తీసుకెళ్లారు. పొలం యజమాని కౌలు డబ్బు, పంట సాగుకు పెట్టుబడి కలిసి రూ.2 లక్షల దాకా నష్టపోయినట్లు రైతు వాపోయాడు. వానదేవుడు మాత్రం ఇదేమి పట్టనట్లు తనపని తాను యథావిధిగా కొనసాగిస్తున్నాడు. తమను పాలకులే పట్టించుకోకుంటే ఇక ప్రకృతి వైపరీత్యాలు మాత్రం ఏమీ చేయగలవనేది మేధావులు పేర్కొంటున్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ముద్దనూరు నవంబరు7(ఆంధ్రజ్యోతి):స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో బాగంగా స్టేషన్‌లోని పలు క్రైం రికార్డులను, పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్,పోలీసులు పాల్గొన్నారు.

వంట ఏజన్సీలు కావాలి

పోరుమామిళ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ కిచెన్ వద్దు, వంట ఏజన్సీ లు కావాలని ఏఐటీయూసీ నాయకులు సఫా, రేణుకమ్మ, పీరయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఈ నెల 10న కడపలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

స్వదేశీ వస్తువులనే ప్రోత్సహిద్దాం

కొండాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పిలుపు మేరకు మన దేశంలో తయారైన వస్తువులనే ప్రోత్సహిద్దామని మండల కూటమి ఇన్‌చార్జి శివ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక స్వయం సమృద్ధి భారత్ పై సమావేశాన్ని నిర్వహించారు. ఏదైనా దేశంలో తయారయ్యేవాటికి ప్రధానం ఇవ్వాలని ఆయన తెలిపారు.

స్వనిధి పథకం చిరువ్యాపారులకు వరం


మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధా నమంత్రి ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వనిధి) పథకం చిరువ్యాపారులకు వరమని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మెప్మా ఆధ్వర్యం లో మైదుకూ రు స్త్రీ శక్తి భవన్‌లో 772 మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల 15వేల మెగా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరువ్యాపారుల అభివృద్ధికి ఈ పథ కం ద్వారా చేయూతనివ్వడం ఆనందంగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి మెప్మా పీడీ కిరణ్‌కుమిర్, టీడీపీ నేతలు దాసరి బాబు, రవీంద్ర, రాదాక్రిష్ణ, శ్రీను, బీఎన్‌శ్రీను, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా వందేమాతర గీతాలాపన


జమ్మలమడుగు వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న పెన్షనర్లు

ప్రొద్దుటూరు టౌన్/జమ్మలమడుగు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యాసంస్థలలో వందేమాతర గీతాలాపన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు దేశవ్యాప్తంగా ఒకేసారి వందేమాతరం గీతం ఆలపించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులు ఉత్సాహంగా వందేమాతరం గీతంను ఆలపించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు వందేమాతరం గీతం ఆలపించారు. జమ్మలమడుగు పెన్షనర్స్ భవనంలో వందేమాతరం జాతీయ గీతం పాడారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రామయ్య, కార్యదర్శి రామచంద్రారెడ్డి ఉపాధ్యక్షులు రామచంద్రుడు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మైదుకూరులో: వందేమాతరం గేయం రచించి నేటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మైదుకూరు రాయల కూడలిలో నిర్మించిన 100 అడుగుల జాతీయజెండా వద్ద అధికారులు, జిల్లాపరిషత్ స్కౌట్ విద్యార్థులు కూటమి నాయకులు, వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా అదికారులు బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గీతం ప్రాముఖ్యతను వివరించారు.

విద్యార్థులకు బహుళ నైపుణ్యం ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బహుళ నైపుణ్యాలను అలవర్చుకోవాలని డిప్యూటీ డీఈవో యు.మీనాక్షి పేర్కొన్నారు. మానస కళాసాంస్కృతిక సమాజం 7వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వేరువేరుగా నగదు బహుమతులు, మెమోంటోలు అందజేశారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

బి.కోడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ఐత్రంపేట, గోవిందాయపల్లె, మేకవారిపల్లె కస్తూర్బాగాంధి పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీడీపీవో శ్రీదేవి, ఎంఈవోలు సునీల్‌కుమార్, రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు ఆడపిల్లలను రక్షించాలి

చాపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఆడపిల్లలను రక్షించాలని సీడీపీవో ముంతాజ్‌బేగం, ఎంపీడీవో వీరకిశోర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్లు సర్పంచులు ప్రసాదు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా మొక్కలు పంపిణీ



ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎద్దుల వెంకటసుబ్బమ్మ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు బీజేపీ పట్టణాధ్యక్షుడు పాళెం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. శుక్రవారం 150 ఏళ్ల సంబరాల్లో భాగంగా తహసీల్దారు గంగయ్య చేతుల మీదుగా వాటిని ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్, నాయకులు బి.జయలక్ష్మి, వరప్రసాద్, బాలాజీ, పవన్, హరీష్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మాజీ నేత షబ్బీర్ మృతి

ప్రొద్దుటూరు , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):ఏఐటీయూసీ అనుబంధ టైలర్స్ యూనియన్ నేత, క్లాసిక్ టైలర్ షబ్బీర్ క్యాన్సర్‌తో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ప్రొద్దుటూరు సిటిజన్‌ఫోరం సభ్యుడిగా ఉంటూ సామాజిక సేవలో చురుకుగా పాల్గొనేవారు. ఆయన మృతి పట్ల సీపీఐ నేత రామయ్య, ఏఐటీయూసీ నేత సుబ్బరాయుడు సంతాపం తెలియజేశారు.

ఐడీఏ సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు


ఐడీఏ సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద విద్యుత్ శాఖ అధికారులు

ప్రొద్దుటూరు , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ కొర్రపాడు రోడ్డులో గల ఐడీఏ సబ్ స్టేషన్‌లో అదనపు లోడు అధిగమించడానికి కొత్తగా 8 మెగా వోల్ట్ యాంప్స్ (ఎంవీఏ) సామర్థ్యం కలిగిన రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను శుక్రవారం ఎంఆర్‌టీ విభాగం డీఈ నీలం రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోజు రోజుకు విద్యుత్ అదనపు లోడు పెరిగిపోతున్నందున సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను పెంచుకోవాల్సివుంటుందన్నారు. గతంలో ఇక్కడ 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండేవని ఇప్పుడు వాటి స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడం వలన అదనపు లోడును అధిగమించవచ్చన్నారు. మోడంపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలలోని సబ్ స్టేషన్‌లలో కూడా త్వరలో 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన టాన్స్‌ఫార్మర్లను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ డీఈ శ్రీనివాసులరెడ్డి, నార్త్ ఏఈ అబ్దుల్ జబ్బార్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటితోనే ఆరోగ్యం


ఎస్సీ బాలుర హాస్టల్‌లో ప్యూరిఫైడ్ వాటర్‌ను ప్రారంభిస్తున్న విజయమ్మ

పోరుమామిళ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛమైన తాగునీటితోనే ఆరోగ్యంగా ఉండవచ్చని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. మండ లంలోని రంగసముద్రం పంచాయతీలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు ప్యూరిఫైడ్ వాటర్ అందించాలన్న ఉద్దేశ్యంతో ఎంపీడీవో కల్వకూరి రమణ వాటర్ ప్యూరిఫైడ్ సిస్టంను విరాళంగా ఇచ్చారు. శుక్రవారం బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఈ ప్యూరిఫైడ్ వాటర్ సిస్టంను ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఛైర్మన్ కల్లూరి వెంకటక్రిష్టారెడ్డి, టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణరెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, కల్వకూరి రమేశ్ హాస్టలు వార్డెన్ బాలుడు తదితరులు పాల్గొన్నారు.

సమయానికి పరీక్ష.. ఆరోగ్యానికి సురక్ష

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమయానికి పరీక్ష చేయించుకుని ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని వైఎంఆర్ కాలనీ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.హిమబిందు అన్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటి వద్దకు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరు వారికి సహకరించి స్క్రీనింగ్ చేయించుకుని క్యాన్సర్‌పై విజయం సాధించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ వి.అనూష మాట్లాడుతూ క్యాన్సర్‌కు భయపడవద్దని, అవగాహనతో ముందుకు సాగాలన్నారు. అనంతరం వైఎంఆర్ కాలనీ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీవో ఎంవీ సుబ్బారెడ్డి, యుపీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భూములు ఇచ్చిన మాకే దారి ఇవ్వరా..?

- గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతుల నిరసన


రైతులతో కలిసి వంతెనను పరిశీలిస్తున్న బీజేపీ నేత సుబ్బరాయుడు

మైదుకూరు నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భూమాతను నమ్ముకొని వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తాము ప్రజా ప్రయోజనాల కోసం విలువైన భూములను త్యాగం చేస్తే మా పొలాల్లోకి వెళ్లడానికి మాకే దారి ఇవ్వరా..?అని గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమేరకు మైదుకూరు మున్సిపాలిటీ పరిదిలోని లింగాల దిన్నె గ్రామ సమీ పంలో బెంగుళూరు విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేపై రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. రహదారికి ఇరువైపులా రైతుల పొలాలు ఉన్నాయని అక్కడ నిర్మిస్తున్న వంతెన వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలులేని విధంగా చాలా ఇరుకుగా నిర్మిస్తుండడంతో ఇబ్బందులు కలుగుతాయని రైతులు హైవే పనులను అడ్డుకోబోతే గుత్తేదారు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా ఉపా ధ్యక్షుడు మాచనూరు సుబ్బరాయుడు రైతులతో కలిసి వంతెనను పరిశీలించి మాట్లాడుతూ ఉత్సలవరం, గడ్డమాయపల్లికోనాయపల్లి గ్రామ ప్రజలకు రహదారికి ఇరువైపులా రైతుల పొలాలు ఉన్నాయని వంతెన కాలువకు, రాకపోకలకు అనువుగా నిర్మించకపోవడంతో ఇక్కడి రైతులు ఇబ్బందులు కలుగుతాయన్నారు. వంతెనను సౌకర్యవంతంగా నిర్మించకపోతే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో పార్టీ అధిష్టానం మేరకు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు వారివారి సమస్యలను అర్జీల రూపంలో భూపేశ్‌రెడ్డికి అందజేశారు. ఆ సమస్యలను త్వరలోనే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను కోరారు. మైలవరం మండలం దన్నవాడ గ్రామానికి చెందిన పెద్ద పాపిరెడ్డి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.5 లక్షల చెక్కును భూపేశ్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మండల నాయకుడు శ్రీనివాసులరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ మల్లికార్జున, చేనేత సహకార సొసైటీల యజమానులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

బద్వేలుటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ కుమార్‌రెడ్డి, బొజ్జా రోశన్నలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. కూటమిప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు.

రూ.25 లక్షలతో రోడ్డు పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని దొరసానిపల్లె గ్రామ పంచాయతీలో ఉన్న తిమ్మన్న కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనుల నిర్మాణానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి భూమి పూజ చేశారు. శుక్రవారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన వ్యయంతో ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో దొరసానిపల్లె పంచాయతీ సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మినారాయణ, ఏఈ గణేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాంబశివారెడ్డి, టీడీపీ నాయకులు బాస్కర్‌రెడ్డి, అరవ రాజా, చిన్నరాయుడు, వరద శివ, సింగరామయ్య, బోనం గురివిరెడ్డి, తలారి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూమి సాగులో ఉన్న పేదలకు పట్టాలివ్వండి

కలసపాడు,నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మల్లువారిపల్లె సర్వేనెంబర్ 1లో సాగులో ఉన్న పేదలకు పట్టాలివ్వాలని టీడీపీ రైతు విభాగం జిల్లా ఉపా ధ్యక్షుడు పామూరి బాలిరెడ్డి అధి కారులను కోరారు. శుక్రవారం తహసీల్దార్ మధురవాణికి ఆయన పేదలతో కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా కొండ వాగు భూమిలో రాజుపాలెం, మల్లువారిపల్లె గ్రామాలకు చెందిన పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు సాగులో ఉండి భూమిని చదును చేసుకొని వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఆ భూమిపై ప్రభుత్వ భూమి అని ఇటీవల నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు పొలం వద్దకు వచ్చి విచారించి పేదలకు పట్టాలివ్వాలని ఆయన విన్నవించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, ప్రధాన కార్యదర్శి నాసర్జీలు పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం శివాలయం సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర సమయంలో అనేక హామీలు ఇచ్చారని, నేడు ఆ హామీలను అమలు చేయలేకపోతున్నారని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు మస్తాన్, షరీఫ్, నాగభూషణం, కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్, మదన్, సుబ్బరాయుడు, చరణ్‌తేజ్ పాల్గొన్నారు.

దాల్మియా బాధిత గ్రామాల ప్రజలను కాపాడండి

మైలవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దాల్మియా సిమెంటు పరిశ్రమ సమీప గ్రామాలైన నవాబుపేట, బుగ్గనపల్లె గ్రామాల్లోని ప్రజల ప్రాణాలను కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సీపీఐ నాయకులు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామాల్లో రైతు సంఘం, సీపీఐ నాయకుల బృందం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దాల్మియా పరిశ్రమలో బ్లాస్టింగ్ వలన గ్రామాల్లోని ఇళ్ల నెర్రలు చీలి పడిపోయే విధంగా ఉన్నాయని, అలాగే దుమ్ము, దూళితో మనుషుల ప్రాణాలు పోయే విధంగా ఉందని అలాగే పంటలు కూడా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నాని ప్రజలు వారికి తెలిపారు.